# మల్లెమొగ్గల గొడుగు

## అంటరానోళ్ళ ఆత్మకథలు

# గొడ్డల్లికి పదును బెట్టాల

ఎండ్లూరి సుధాకర్.

మా సుందరమ్మ పెళ్ళికన్లైని చెప్పి శాంతమ్మ, ఆనందరావన్న పొద్దుడుగూకులు యాదో వక పని జేస్తానే వుండారు. గుడిసి సుట్టూ వుండే గచ్చపొదలు నరకడమో, దడి గట్టేదో జేస్తా వుండారు.

ఆయాల గుడిసె గప్పను తాటాకు గావాలన్జెప్పి ఆనందరావన్న గొడ్డలి బుజానేసుకోని తాటితోపుల్లోకి బోతా నన్ను గూడా యెనకీతలే దీసకబొయ్యినాడు. ఆయన్న బరబర నడస్తా వుంటే సరసరా నల్లనాగుబాము పాకినట్టుంటాది. మావోడియ్యి యినప కాళ్లు, ముళ్ళు దిగినా మొగ్గల మాదిరి ముడసకబోతయ్యే గానీ లోపలికి దిగవు.

ఆయన్న అట్టా గబగబా నడస్తావుంటే నేను పరుగుల్దీస్తా యెంటబోతా వున్న. అదే మా శాంతమ్మగానయితే ఈయ్యారికి గల గలా మాట్లాడతా పక పకా నవతా వుండేది. ఈయన్న మాత్తరం అట్టగాదు. మనం కలిపిచ్చుకుంటే గానీ మూతిప్పడు. సీమసింత కాయల మాదిరి పండ్లేసుకుని నవ్వుతడే గానీ మారు మాట్టాడ్డు.

పొద్దస్తమానమూ అట్టా గొడ్డు మాదిరి పని జేస్తా వుంటడు గానీ, అలుపనేది యరగడు. యింతకు మునువు జెప్పిండ్లా! మాచిన జేజి నాయిన కొడుకు గురనాయనయితే ఆయిన కొడుకు ఆనందరావని. మా గురనాయిన నాకింకా మతికుండడు. మనిసి దిట్టంగుండేది. నల్ల పులి మాదిరి కానొస్తా వుండేది. గురనాయిన మాంచి పరువులో వున్నప్పుడు బోపనులు జేసేవోడు. కొండల తట్టు పులిగొట్టిన దుప్పి దొరికినా, సచ్చినగొడ్డు జిక్కినా ఒక్కడే సంకనబెట్టుకోని దెచ్చేవోడు. అంత బలిమిగల్లోడు. అయితే బో ఓరువు గల్లోడు.

ఆవు నెమిరేసినట్టు ఎప్పుడూ ఆ కొక్కా నవలతా వుండేది. అదుంటే సాలు ఎంత పనున్నా రొంచేపుట్లో జేసేది. ఆనందరావన్నకి మాత్తరం ఆకొక్క అలవాటు లా! ఎపుడైనా బీడి గాలుస్తడేమో! అదీ శాంతమ్మ సూడకుండా.

నేనిట్టా ఆలోశన జేస్తా నడస్తా వుంటే ఆనందరావన్న తుమ్మ సెట్టు కింద గొడ్డలి జేరేసి బీడీ ఎలిగిస్తా వుండేడు. ఇంగ నేను గూడా తుమ్మ మొద్దుకి జారబడదామనుకోని ఆడకి బోయేలేకి నా కాలు దగిలి గొడ్డలి జారి పడ్డది.

ఇంగ మా యన్న ఆత్రంగా గొడ్డలి జవురుకోని కళ్ళకద్దుకోని

"యంత పన్జేస్తివి సుదయ్యా! గొడ్డల్ని కాల్తో తంతివా?" అనన్నడు.

ఇంగ నేను బెదిరిపొయ్యి "యాందనా? ఈ గొడ్డలి కుండే గొప్పదనమేంది?" అనడిగినా అర్ధం గాక!

ఆడ ముళ్ళుంటే ఏరి వల్లె బరిసి నన్ను కూసోబెట్టిండు.

"ఈ గొడ్డలి మన జేజినాయిన్ల కాలం నించీ వుందయ్యా! అంతేకాదు. దీనెనక పెద్ద సెర్రిత గూడా వుండాది. యిది మామూలు గొడ్డలి అనుకుంటుండవా? సామాన్నమయ్యింది గాదు. రెడ్డిని గొట్టిన గొడ్డలిది!" అని అన్న జెబతా వుంటే దీని కతేందో కనుక్కుందమని నాకు ఉచ్చాకం బుట్టింది. ఆనందరావన్న ఆరిపోయిన బీడీ ఎలిగిచ్చి గొడ్డలి కత జెబతా వుంటే నేనా గొడ్డలిని బిడ్డ మాదిరి ఒల్లో బెట్టుకోని దాన్ని నిమరతా ఆ కత యింటా వుండినా....

◐ ◐ ◐

గురనాయిన కొండకి బొయ్యికట్టెలు గొట్టుకోని ఏనుగంత మోపు నెత్తిన బెట్టుకోని వొస్తావుండాడు. బాగా దప్పికేస్తా వుండాది. మా వూరి వాగుకాడికొచ్చి వొక్కడే మోపు దింపుకోని నీల్లు దాగుతామని నీల్లల్లోకి దిగినాడు. అప్పడే ఆడ ఎవురివో మాటలినబడ్డయ్యి.

'యామిడిదబ్బా! సందెకాడ యియ్యేలప్పుడు మనసులు అరుసుకుంటుండిరే' అనుకుని గొడ్డలి బుజానేసుకుని వాగుదాటుకోని యెనక బొయ్యి జూస్తే యాముండది?

కోటారెడ్డి దావీదమ్మ కొంగుబట్టుకోని లాగతా వుండాడు. దావీదమ్మ పెయ్య మాదిరి గింజకలాడుతా, యిదిలిస్తా వుండాది.

కోటారెడ్డి బాగా తాగున్నాడు. 'దావీదమ్మ! యాంది మే! నువ్వు పక్కకి రా!' అని అరుసుకుంటూ బొయ్యినాడు గురునాయన.

గురనాయన్ని జూసేలేకి దావీదమ్మ రయ్యిమంటూ కోడిపిల్ల మాదిరి లగూదీసి గురనాయన సేతులు బట్టుకోని ఏడస్తా వుండది.

గురనాయనకి దావీదమ్మ సెల్లెలు వరస అవతది.




'సూదు గురన్నా! ఈ రెడ్డి నా రెక్కబట్టుకోని 'మ్యోయ్! తాల్లస్తా గానీ తోటలోకి బోదాం పా!' అని యెంటబడి తరమతా వుండదు' అన్జెప్పింది.

గురనాయనకి ముందే యిసయం దెల్సిపో యింది. 'కుర్రరెడ్డి తాగున్నాడు. ఆయనేమంటే పెదరెడ్డి కొడుకు' యామందామన్నా బాగుండదు' అని మనసులో అనుకొని పైకి మాత్తరం

'రెడ్డిగోరూ! మీకిది దరమం గాదు. సదుం కున్నోళ్ళు జెయ్యాల్సిన పనిగాదు. మీకు దండం బెడతా గానీ సామీ! ఈ సంగతి ఈన్నే మరిసిపోదం. ఎవురింటి వోల్లం బోదాం'

అని బతిమాలి బామాలి అడగతా వుంటే కోటయ్య బోకొవ్వుబట్టి రెచ్చిబోతా వున్నాడు. గుర నాయిన ఎంత సెప్పినా గవనిచ్చుకోవడంలే. గడ్డి కోసకరాను బొయ్యి సందకాడ తిరిగొస్తుండగా కోటయ్య పాలబడ్డది దావీదమ్మ. వాగు దాటుకొని వస్తావుండగా ఈ కోటిగాడు బట్టుకున్నడు.

గురనాయన ఇంక బతిమాలతానే వున్నడు. 'వొద్దు రెడ్డీ!నీకు మరియాద గాదు. మట్టసంగ వుండదు. నా మాటినుకో తండ్రా!' అని ఎంత కుదురుగా చెప్పినా యినిపిచ్చుకోకుండా గురనా యన్ని అమ్మలక్కల తిట్లు తిడతా యిదిలచ్చి కొట్టి దావీదమ్మ యెదమింద సెయ్యేసిండు.

ఇంగ అది జూసి గురనాయిన పులిమాదిరి గాండ్రించుకోని పెద్దంగ అరిసి గొడ్డలి యనక్కి దిప్పి కట్టెతో రెడ్డి నెత్తిన ఒక్క యేటు యేసినాడు.

అప్పటిగ్గానీ రెడ్డి మత్తుదిగలా! నెత్తురు గారతా వుంటే తుడుసుకుంటూ వాగులో బడి ఈతగొడతా ఎల్లిపొయ్యిండు.

ఇంగ ఈ సంగతి సారాయి వోసన మాదిరి వూరంతా గుప్పుమన్నది.

"మాదిగ రెడ్డిని గడతడా?" అను కోని రెడ్లంతా కర్రలు దీసుకొచ్చి గురనాయన్ని కొట్టేదానికొచ్చిను.

ఇంగ గురనాయన తెగిచిచి రవుద్దరంగా గొడ్డలి గిరగిర తిప్పతా సాము సిందులేస్తా వుంటే రెడ్లు గొడ్లమాదిరి బెదిరి పొయ్యినారు.

'ఒరెరె, ఈ కొడుకుని గొట్టలేము' అనుకొని కరణాన్ని దీసుకొని కవిగిరికి పొయ్యింద్రు.

గురవ్వ మమ్మల జంపనొచ్చినాడని పోలీసు కేసు బెట్టినారు.

ఇంగ ఆవంతనే నాలుగైదు నెల్లు కేసు వాయి దాలు బడతా వచ్చింది. ఆనెక్కి కేసు కొట్టి పారనూకిన్రు.

ఇంగ అయాలనుంచి గురనాయన జోలికి ఎవురూ రాలే.

◐ ◐ ◐

'ఇంత కతనడిపిన గొడ్డలి సుదయ్యా! ఇది' అంటా జెప్పి గొడ్డలి బుజానేసుకుని 'పోదాం పొయ్యా!' అన్నాడు.

ఇంగ నాకు నేను ఆలోశన చేస్తా వుండా. ఈనా టికీ దావీదమ్మ లాంటి ఆడోళ్ళ మింద దాష్టీకాలు జరగతానే వుండయ్యి. పోలీసోల్లేం జేస్తుండరు? కోర్టులేం జేస్తుండయ్యి?

ఇప్పుడు గురయ్యలు బుట్టాల!
గొడ్డలకి పదును బెట్టాలా!

●